



సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 21-7-2025

సంపుటి: 21 సంచిక: 101

పేజీలు: 8 వెల: రూ.1





- అదనపు పనులతో పాఠశాలల వేళలు వృథా
- ఒకే సమాచారాన్ని పదే పదే పంపాల్సిన దుస్థితి
- సీర్పీలను కాంప్లెక్స్‌ల్లో కూర్చోబెట్టి టీచర్లపై ఒత్తిడి
- వారు ఉండగా మళ్లీ టీచర్లను వాడేసుకుంటున్న వైనం

## కొసరు పనులతో
# బోధనకు ఎసరు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పాఠశాల విద్యను ప్రక్షాళన చేస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి వాస్తవికతకు మధ్య పొంతన కుదరడంలేదు. గత ప్రభుత్వంలో పాఠాలు చెప్పడం కంటే ఇతర అంశాల పైనే టీచర్లు ఎక్కువ దృష్టి పెట్టాల్సివచ్చేదన్న విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు కూడా ఆ పరిస్థితిలో పెద్ద మార్పు కనిపించడంలేదు. ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం కలెక్టర్లతో సహా విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకుంటున్న అర్థరహిత నిర్ణయాలు, చర్యలు తీసుకుంటున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ప్రస్తుత విద్యా సంవత్సరంలో 230 పని దినాలు ఉన్నాయి. ఇప్పటికే అందులో దాదాపు పది శాతం పనిదినాలు పూర్తయ్యాయి. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమైంది. గత నెలన్నర రోజుల్లో అధికారిక వాట్సాప్ గ్రూపులో 18 సార్లు గూగుల్ ఫారం నింపాలని లింకుల ద్వారా అధికారులు ఆదేశించారు. నాలుగుసార్లు పాఠశాల పనివేళల్లో జూమ్ మీటింగ్స్ నిర్వ హించారని పలువురు టీచర్లు సాక్ష్యాధారాలతో చూపించారు. ఉదయం 9.30 గంటలకు బోధన సమయంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహణపై జిల్లా విద్యాధికారి జూమ్ సమావేశం నిర్వహించడాన్ని టీచర్లు తప్పు పడుతున్నారు.

### అదనపు పనులతోనే సరి

ప్రతి నెలా తల్లిదండ్రులను పిలవడం, డాక్యుమెంట్లు, సమావేశం ఫోటోలు, సాక్ష్యాధారాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయడాన్ని ఉపాధ్యాయులు చాలా ఇబ్బందికరంగా భావిస్తున్నారు. పన్నెండు రోజులపాటు సాగిన బడిబాటలో రోజువారీ వివరాలను మండల కేంద్రానికి పంపడంతోపాటు రాష్ట్ర వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, దానికి తోడు సీఆర్పీ నుంచి రోజూ ఫోన్ కాల్స్ వచ్చేవని మరో ఉపాధ్యాయుడు తెలిపారు. సీఆర్పీల నుంచి ఇప్పటి వరకు 30 కాల్స్ పైగా వచ్చాయని, ప్రొగ్రెషన్ యాక్టివిటీ, యూడైస్ అప్డేషన్, టెక్స్ట్‌బుక్ ఎంట్రీ, నోట్‌బుక్స్ ఎంట్రీ, యూనిఫారాలు.. ఇవి కాకుండా ఈపీలు, జీపీల ఎంట్రీ పేరుతో ట్యాబ్, మొబైల్ ఫోన్లకు గంటల తరబడి అంకితం కావాల్సి వచ్చిందన్నారు. అటెండెన్స్ కాప్చర్‌తో పాటు మధ్యాహ్న భోజనం యాప్‌లో వివరాలు నమోదు చేయడం, కాంప్లెక్స్ గ్రూపులో వివరాలు షేర్ చెయ్యడం వంటి పనులతో గంటకు పైగా బోధన సమయం కరిగిపోతోందని మరో ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. ముగ్గురు టీచర్లు ఉన్న తమ స్కూల్లో ఒకరు రెండున్నర రోజులు, మరొకరు మూడు రోజులు సెలవులో ఉన్నారని, ఆ ఆరు రోజుల్లో బోధన జరగలేదని ఇంకో ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రారంభ పరీక్ష పేరిట రెండు రోజులు, యోగా పేరిట అర పూట, చెట్లు నాటే కార్యక్రమానికి ఒక పూట ఇలా మరో మూడు రోజులు.. వెరసి పది రోజులు పోయాయని, మిగిలిన రోజుల్లో ఒక తరగతికి ఒక పాఠం చెబితే, మరో తరగతి చూస్తూ ఉండిపోయిందన్నారు. రోజూ ఇంత సమాచారాన్ని పాఠశాల నుంచి రాష్ట్రం, కేంద్రం వరకు పంపిస్తుంటే, సైకిళ్ల పంపిణీ డేటా కోసం మళ్లీ విద్యార్థుల వివరాలు అడగాల్సిన దీనావస్థ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈరోజు ఏ విద్యార్థి హాజరయ్యారన్నది చిరునామా, ఆధార్ సంఖ్య, ఫోటోతో సహా తెలుసుకునే వెసులుబాటు ఉండగా పదో తరగతి విద్యార్థినుల సంఖ్య అధికారుల వద్ద లేక మళ్లీ గూగుల్ ఫారం ద్వారా సేకరించడం హాస్యాస్పదం.

### సీఆర్పీలు ఎందుకు?

సమాచార సేకరణ, మానిటరింగ్ వంటి విషయాల్లో పాఠశాలకు విద్యాశాఖతో సమన్వయం చేయాల్సిన సీఆర్పీలు ఎక్కడా భౌతికంగా కనిపించడం లేదు, చాలాచోట్ల వీరు ఎమ్మార్సీ లేదా కాంప్లెక్స్ పాఠశాలల్లో క్లర్కులుగా మిగిలిపోతున్నారు. ఫోన్, వాట్సప్ ద్వారా మినహా టీచర్లను నేరుగా కలిసే అవకాశం వారికి లేదు. ఉపాధ్యాయులు సెలవు పెట్టిన సందర్భాల్లోనూ సీఆర్పీలను పాఠశాలకు పంపడం లేదు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు క్లరికల్ స్టాఫ్ ఉన్నప్పటికీ ఒక టీచర్‌ను అనధికారికంగా అసిస్టెంట్‌గా పెట్టుకుని బిల్లులు వేయడానికి వాడుకుంటుండటం, సీఆర్పీలను సొంత పనులకు వినియోగించుకోవడం విచారకరం. ఏదైనా రిపోర్టులు ఇవ్వాల్సి వస్తే టీచర్లు ఒక పూట ఆన్‌డ్యూటీ పేరుతో మండల విద్యా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ విద్యా సంవత్సరం యూనిఫారాల కోసం మూడు పూటలు, పాఠ్యపుస్తకాల కోసం ఒకసారి, నోటు పుస్తకాల కోసం మరోసారి పాఠశాల నుంచి ఒక టీచర్ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చింది. సీఆర్పీ వ్యవస్థ పక్కదారి పట్టడం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. దీనికి ఒక విధంగా ప్రభుత్వమే కారణం. దీని వల్ల బోధనా సమయానికి గండి పడుతోంది. ఒక సీఆర్పీ పరిధిలో మహా అయితే పది పాఠశాలలు ఉంటాయి. నాలుగు రోజుల్లో మొత్తం సమాచారం సేకరించడమే కాక యూడైస్, ఆన్‌లైన్ వర్క్ వంటి - మిగతా చివరి పేజీలో

---



రాష్ట్రంలో ఏడాది క్రితం కొలువుదీరిన ఎన్డీయే కూటమి సర్కార్ అప్పుడే ప్రజావ్యతిరేకత ఎదుర్కొంటోందా? సూపర్ సిక్స్ పేరుతో ఆరు గ్యారెంటీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తూ విజయవంతంగా పనిచేస్తోందన్న భావనను కూటమి పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ మరో అడుగు ముందుకేసి 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో ప్రజల వద్దకు వెళ్లి ఏడాది పాలనలో చేసిన పనులు, హామీలు అమలు చేసిన తీరును ప్రజలకు వివరిస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలన తీరుపై ప్రజల మనోగతం తెలుసుకునేందుకు అనేక సర్వేలు జరుగుతున్నాయి. కూటమి పాలనపై క్రమంగా వ్యతిరేకత, అసంతృప్తి పెరుగుతున్నట్లు దాదాపు అన్ని సర్వేలు అంచనా వేశాయి. మిగతా సర్వేల సంగతెలా ఉన్నా ప్రముఖ సెఫాలజిస్టుల నేతృత్వంలో హైదరాబాద్‌కు చెందిన ఐఐటీయన్ల గ్రూప్ ప్రకటించిన సర్వే అంచనాలు ఒక విధంగా డేంజర్ అలారమ్స్ మోగించినట్లే చెప్పాలి.

- ఏడాది కాలంలోనే ప్రజల్లో తరిగిన పరపతి
- సగానికిపైగా కూటమి ఎమ్మెల్యేలపై వ్యతిరేకత లేదా అసంతృప్తి
- డేంజర్ జోన్‌లో 13 మంది మంత్రులు
- సూపర్ సిక్స్ హామీల అమల్లో ఫెయిల్
- పవన్‌కల్యాణ్ తీరుపై జనసైనికుల నిస్పృహ
- హైదరాబాద్ ఐఐటియన్స్ గ్రూప్ సర్వేలో వెల్లడి

# ప్రభుత్వమా.. పారాహుషార్

**(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో దాని పనితీరు, ఎమ్మెల్యేలు, మంత్రులు వ్యవహారశైలిపై ఐఐటీయన్ల గ్రూప్ పూర్తి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించిన సర్వేలో వెల్లడైన ఫలితాలు కూటమి సర్కారుకు వ్యతిరేకంగానే ఉన్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు రెండు దశల్లో నిర్వహించిన ఈ సర్వేలో మొత్తం 294 నియోజకవర్గాలకు గాను 172 నియోజకవర్గాల నుంచి ఒక్కో దాంట్లో 425 చొప్పున మొత్తం 72,900 మంది నుంచి అభిప్రాయాలు సేకరించారు. అన్నివర్గాల ప్రజల నుంచి సూపర్ సిక్స్ హామీలతో సహా మొత్తం 65 అంశాలతో ప్రశ్నావళి ఇచ్చి సమాధానాలు రాబట్టారు. వాటన్నింటినీ సమగ్రంగా విశ్లేషించి ఫలితాలను అంచనా వేశారు. దాని ప్రకారం.. మొత్తం 164మంది కూటమి ఎమ్మెల్యేల్లో ఏకంగా 72మంది ఎమ్మెల్యేలు వ్యతిరేకత ఎదుర్కొంటుంటే.. మరో 26మందిపై అసంతృప్తి ఉన్నట్లు ఈ సర్వే వెల్లడించింది. కేబినెట్‌లో సీఎం చంద్రబాబు సహా 25మంది ఉంటే పదిమంది మంత్రులు వ్యతిరేకత, ముగ్గురు మంత్రులు అసంతృప్తి ఎదుర్కొంటున్నట్లు ఐఐటీయన్ల గ్రూప్ అంచనా వేసింది. ఉమ్మడి జిల్లాలవారీగా అంచనాలను పరిశీలిస్తే.. శ్రీకాకుళం జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలు(టీడీపీ-2, జనసేన-1, బీజేపీ-1) వ్యతిరేకత ఎదుర్కొంటుండగా, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది. విజయనగరం జిల్లాలో నలుగురు టీడీపీ, ఒక జనసేన ఎమ్మెల్యేపై వ్యతిరేకత, ఒక టీడీపీ ఎమ్మెల్యేపై అసంతృప్తి కనిపించింది. విశాఖ జిల్లాలో ఒక టీడీపీ, ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉండగా, ఇద్దరు టీడీపీ, ఒక జనసేన ఎమ్మెల్యేపై అసంతృప్తి ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ, జనసేనలకు చెందిన నలుగురు చొప్పున ఎమ్మెల్యేలు వ్యతిరేకత, ఇద్దరు టీడీపీ, ఒక బీజేపీ ఎమ్మెల్యే అసంతృప్తి ఎదుర్కొంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో చెరో ముగ్గురు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది. కృష్ణా జిల్లాలో టీడీపీకి చెందిన ఏడుగురు ఎమ్యెల్యేలు వ్యతిరేకత, మరో ఇద్దరు అసంతృప్తి ఎదుర్కొంటున్నారు. గుంటూరు జిల్లాలో ఒక జనసేన, ఆరుగురు టీడీపీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉంటే.. ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది. ప్రకాశం జిల్లాలో టీడీపీకి చెందిన నలుగురిపై వ్యతిరేకత, ఇద్దరిపై అసంతప్తి ఉన్నట్లు తేలింది. నెల్లూరు జిల్లాలో టీడీపీకి చెందిన నలుగురిపై వ్యతిరేకత, ఇద్దరిపై అసంతృప్తి కనిపించింది. కడప జిల్లాలో ముగ్గురు టీడీపీతోపాటు చెరో జనసేన, బీజేపీలపై వ్యతిరేకత ఉండగా, ఒక టీడీపీ ఎమ్మెల్యేపై అసంతృప్తి ఉంది. కర్నూలు జిల్లా ఐదుగురు టీడీపీ, ఒక బీజేపీ ఎమ్మెల్యేపై వ్యతిరేకత, మరో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్నట్లు తేలింది. అనంతపురం జిల్లాలో ఆరుగురు టీడీపీ, ఒక బీజేపీ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, ఒక టీడీపీ ఎమ్మెల్యేపై అసంతృప్తి ఉంది. చిత్తూరు జిల్లాలో ఐదుగురు టీడీపీ, ఒక జనసేన ఎమ్మెల్యేపై వ్యతిరేకత, మరో ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉన్నట్లు అంచనా వేశారు.

### సగానికిపైగా డేంజర్ జోన్‌లోనే..


గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 135 మంది టీడీపీ, 21 మంది జనసేన, ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. వారిలో ప్రస్తుతం టీడీపీకి చెందిన 54 మంది రెడ్ జోన్‌లో ఉండగా, 22 మంది ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు. జనసేన నుంచి ఏకంగా 14 మంది రెడ్‌జోన్‌లో ఉంటే.. ముగ్గురు ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు. బీజేపీ నుంచి నలుగురు రెడ్‌జోన్‌లో, ఒకరు ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు. మొత్తం మీద చూస్తే 72 మంది రెడ్‌జోన్‌లో, 26 మంది ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు. కేవలం 66 మంది కూటమి ఎమ్మెల్యేలపైనే ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు ముఖ్యమంత్రితో సహా మొత్తం 25 మంది మంత్రులు ఉండగా.. తొమ్మిదిమంది టీడీపీ, ఏకైక బీజేపీ మంత్రి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇద్దరు టీడీపీ, ఒక జనసేన మంత్రిపై అసంతృప్తి ఉంది. మొత్తం మీద 13 మంది మంత్రులు ప్రజల అంచనాలను అందుకోలేకపోతున్నారని ఈ సర్వే తేల్చింది. మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, ఫరూక్, పార్థసారథి, గుమ్మడి సంధ్యారాణి, టి.జి.భరత్, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిలు తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటూ రెడ్ జోన్‌లో ఉండగా.. హోంమంత్రి వంగలపూడి అనిత, కందుల దుర్గేష్, ఎస్.సవిత అసంతృప్తిని ఎదుర్కొంటూ ఆరెంజ్ జోన్‌లో ఉన్నారు.

Illians group
Hyderabad

**PERFORMANCE OF THE MLA's IN ANDHRA PRADESH (Including Ministers)**
**AS ON 11.07.2025**

| | TDP | JSP | BJP |
|---|---|---|---|
| RED ZONE | 54 | 14 | 4 |
| ORANGE ZONE | 22 | 3 | 1 |
| GREEN ZONE | 59 | 4 | 3 |

RED ZONE – FACING ANTI-INCUMBENCY
ORANGE ZONE – FACING DISSATISFACTION AMONG PUBLIC
GREEN ZONE – SATISFIED PERFORMANCE IN THEIR ASSEMBLY CONSTITUENCIES




### హామీల అమల్లో ఫెయిల్

సాధారణంగా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకు అదనంగా గ్యారెంటీ పథకాలు అంటూ ఎన్డీయే కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్యాకేజీ ప్రకటించింది. ప్రజలు ప్రధానంగా వీటికే ఆకర్షితులై కూటమి వైపు మొగ్గుచూపి గెలిపించారు. కానీ ఏడాది గడిచినా సూపర్ సిక్స్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్న అసంతృప్తి ప్రజల్లో బాగా కనిపించింది.

-యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు రూ.3వేల నెలవారీ భృతి హామీ అమలు కాలేదంటూ 56 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేయగా కేవలం పది శాతం మందే సంతృప్తి చెందారు.

-తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇచ్చే పథకంపై 43 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా 40 శాతం మంది అసంతృప్తితో కనిపించారు.

-19-59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్న ష్యూరిటీ పథకం అమలు చేయనుందుక 49 శాతం మంది అసంతప్తితో ఉన్నారు. 20 శాతం మంది మాత్రం సంతృప్తి వ్యక్తం చేశారు.


-రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయంపై ఏకంగా 57 శాతం మంది అసంతృప్తితో ఉండగా 21 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

- మిగతా 4లో

• ఎడిటోరియల్

# అమరావతి భూసమీకరణకు అవరోధాలు

రాష్ట్ర రాజధాని అమరావతేనని ఘంటాపథంగా చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. దాన్ని కేవలం రాష్ట్ర రాజధానిగానే కాకుండా అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంలో పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారు. ముఖ్యంగా ఏఐ, క్వాంటమ్ సహా అనేక రంగాలకు అమరావతిని సెంటర్ పాయింట్‌గా అభివృద్ధి చేయాలన్నది ఆయన సంకల్పం. అంతవరకు బాగానే ఉంది. కానీ ఈ దిశగా తీసుకున్న ఒక నిర్ణయం ఆయన సంకల్పానికి అవాంతరాలు కల్పిస్తోంది. అదే రెండోదశ భూ సమీకరణ. అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణాలు చేపట్టడం, వివిధ రంగాల సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు సాగించేలా వాటికి భూములు కేటాయించడానికి అదనంగా 44వేల ఎకరాలు సమీకరించాలని చంద్రబాబు సర్కారు తీసుకున్న నిర్ణయానికి అనూహ్యంగా అవాంతరాలు ఎదురవుతున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా నిర్ణయించిన తెలుగుదేశం ప్రభుత్వం.. రాజధాని నిర్మాణాల కోసం ఆ ప్రాంత రైతులను ఒప్పించి.. ఒప్పందాలు చేసుకుని పలు గ్రామాల నుంచి 34వేల ఎకరాలు సేకరించింది. అప్పట్లో ప్రభుత్వం ఇవ్వజూపిన నష్టపరిహారం ప్యాకేజీకి అంగీకరించి రైతులు ల్యాండ్ పూలింగ్ ద్వారా స్వచ్ఛందంగా భూములు అప్పగించారు. అయితే రెండోదశలో ప్రభుత్వం కోరిన మేరకు భూములు ఇవ్వడానికి మాత్రం రైతులు అంగీకరించడం లేదు. దీనిపై ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. ఈ ప్రక్రియలో ఇప్పటివరకు 20 వేల ఎకరాలు ఇవ్వడానికే రైతుల నుంచి సమ్మతి లభించింది. మిగిలిన 24వేల ఎకరాల సేకరణ సందిగ్ధంలో పడింది. రైతులు ముందుకు రాకపోవడమే దీనికి కారణం. రెండో దశలో తుళ్లూరు, అమరావతి మండలాల్లోని ఏడు గ్రామాల నుంచి భూములు సమీకరించాలని నిర్ణయించారు. కానీ మూడు గ్రామాల రైతులే భూములు ఇవ్వడానికి అంగీకరించారు. మిగిలిన నాలుగు గ్రామాల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. ససేమిరా అంటున్న రైతులపై అధికారాన్ని ప్రయోగించి ల్యాండ్ పూలింగ్‌కు అధికారులు సిద్ధమైనా ముఖ్యమంత్రి చంద్రబాబు వారించినట్లు సమాచారం. రైతులకు నచ్చజెప్పి ఒప్పించడం ద్వారానే భూములు సమీకరించాలని అధికారులను ఆదేశించడంతోపాటు ఇటీవలి కేబినెట్ మీటింగులోనూ అదే విషయం తెలిపారు. రైతులకు నచ్చజెప్పే విషయంలో కూటమి పార్టీల నేతలను కూడా కలుపుకొనిపోవాలని టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలను ఆదేశించారు. చంద్రబాబు ఈ వైఖరి తీసుకోవడానికి కారణం.. రాజధాని రైతులు ఇంతకుముందులా ఏకపక్షంగా సహకరించే పరిస్థితి లేకపోవడంతో పాటు కూటమి భాగస్వాములైన జనసేన, బీజేపీలు కూడా రెండో విడత భూసమీకరణ విషయంలో అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండటం ఒక కారణం. ఈ తరుణంలో బలవంతంగా భూసమీకరణకు ప్రయత్నిస్తే రచ్చ రచ్చ అవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందువల్ల ఈ విషయంలో కాస్త వెనుకంజ వేస్తున్నారు. అయితే కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న జనసేన అదనపు భూ సమీకరణకు తీవ్ర అభ్యంతరం చెప్పడం కూడా చంద్రబాబు వెనుకంజ వేయడానికి ఒక కారణమని వాదన కూడా ఉంది. రెండో విడత భూసమీకరణ పేరుతో జనాల్లోకి వెళ్లిన టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులపై వ్యతిరేకత వ్యక్తమవుతుండటాన్ని గమనించిన జనసేన మంత్రులు అటువైపు చూడలేదు. కేబినెట్ భేటీలోనే భూసేకరణ వద్దని వారితోపాటు కొందరు టీడీపీ మంత్రులు కూడా సూచించారని అంటున్నారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ సర్కారు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ చేపట్టింది. అప్పట్లో దాన్ని వైకాపా వ్యతిరేకించగా జనసేన, బీజేపీలు మాత్రం మద్దతు ప్రకటించాయి. తర్వాత 2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చి.. అమరావతిని శాసన రాజధానిగానే పరిమితం చేస్తామని చెప్పినప్పుడు భూములిచ్చిన రైతులు ఉద్యమబాట పట్టారు. ఆ సమయంలో వారికి టీడీపీతో పాటు జనసేన, బీజేపీలు కూడా అండగా నిలిచాయి. కానీ ఇప్పుడు ప్రభుత్వంలో టీడీపీతోపాటు భాగస్వాములుగా ఉన్నప్పటికీ అమరావతికి అదనపు భూసమీకరణ వ్యవహారంలో మాత్రం భాగస్వాములు కావడానికి ఇష్టపడటం లేదు. దీనికి కారణం రైతుల్లో సానుకూలత లేకపోవడమే. గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్లాట్లు, భృతి చెల్లించకుండా మోసం చేశారని, అందువల్ల మళ్లీ మోసపోదలచుకోలేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఇలా అన్నివైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో భూ సమీకరణ ముందుకు సాగడంలేదు.



వి.ఆర్.ఓ.ల సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా వనప గ్రామానికి చెందిన వీఆర్వో గిరీష్ కుమార్ పట్నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు టెక్కలిలో ఆదివారం జిల్లా వి.ఆర్.ఓ.ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో గిరీష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండల వి.ఆర్.ఓ.లు అభినందించారు.

– సత్యంన్యూస్ కొత్తూరు

## కనకదుర్గ అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆషాడ శుద్ధ ఏకాదశి సందర్భంగా సోమవారం విజయవాడ కనకదుర్గ అమ్మవారికి శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీ దుర్గా భవాని సేవా సమితి సభ్యులు 41మంది సభ్యులు ఆధ్వర్యంలో ఆషాడ మాస సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు, పువ్వులు, పూలదండ, మట్టెలు, తిలకము, కాటుక, అద్దము, అభరణములు, సుగంధ ద్రవ్యములు, సాంబ్రాణి గుగ్గిలం, కొబ్బరి బోండం, పళ్ళు, కాయలు, మధుర పదార్థములు, భోగము, అగరువత్తులు, తాంబూలం, పచ్చ కర్పూరం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీరంగం మధుసూదనరావు మాట్లాడుతూ అమ్మవారికి ఆషాడమాస సారె సమర్పించడం అనేది పూర్వం నుండి వస్తున్న ఆనవాయితీ అన్నారు. ఈ సారె ఇంటి ఆడపడుచుగా అమ్మవారిని భావించి ప్రతి హిందూ బంధువులు సమర్పిస్తున్నారన్నారు. అమ్మవారికి సారె సమర్పించడం వలన వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండి సస్యశ్యామలముగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీ దుర్గా భవాని సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సావాడ రామారావు, వ్యవస్థాపక కార్యదర్శి పోదిలాపు అప్పారావు, అరసవల్లి రాజు, ఇప్పిలి రమణ, గొర్లె శ్రీరాములు, కలగ అసిరినాయుడు, పరపతి తవిటినాయుడు, సాడి అప్పారావు, బట్న తేజు, చింతపల్లి ప్రసాద్, పుసర్లపాడు అప్పయ్య, తట్ట అప్పన్న, రుప్ప రమణమూర్తి, తిప్పాన రామారావు తదితరులు పాల్గొన్నారు



## అండర్ 12 స్టేట్ స్కూల్ చెస్ ఛాంపియన్‌గా దత్తు శ్రీ నందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్స్ చదరంగం పోటీల్లో అండర్-12 కేటగిరీలో విశాఖపట్నంకు చెందిన దత్తు శ్రీ నందన విజయభేరి మోగించి ఛాంపియన్‌గా అవతరించింది. ఈ టోర్నమెంట్లో వివిధ జిల్లాల క్రీడాకారులతో తలపడి మంచి ప్రతిభను చూపిందని భవిష్యత్‌లో మరో ఆణిముత్యం అవుతుందని ఆలిండియా చెస్ ఫెడరేషన్ చెస్ ఇన్ స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు అన్నారు. అదేవిధంగా జిల్లా తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు చౌదరి బాబ్జి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమెంటో అందుకున్నారు. డిసెంబర్ నెలలో అస్సాంలో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలని వారు ఆకాంక్షించారు







వైకాపా ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు పొన్నాడ రుషి, డివిజన్ ఇన్‌చార్జ్ పంక్ ప్రసాద్‌ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో స్థానికులు కుప్పిలి త్రినాథ్, పద్రీ రాజారావు, నారాయణరావు, జయమ్మ, జానకి, ఈశ్వరరావు పట్టణ అధ్యక్షులు సాదు వైకుంఠరావు, బీసీ విభాగం పట్టణ అధ్యక్షులు గద్దిబోయిన కృష్ణారావు, బైరి మురళీ, కింజరాపు రమేష్, యండ రమేష్, ఖాను, వానపల్లి రమేష్, భరద్వాజ్, మహేంద్ర, రామారావు, రౌతు శంకరరావు, సీరా సత్యనారాయణ, పట్టణ వైకాపా నాయకులు, వార్డుపెద్దలు తదితరులు హాజరయ్యారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తోంది

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

మద్యం కేసుల్లో కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేస్తోందని వైకాపా బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ విమర్శించారు. ఈమేరకు సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13నెలల్లో వైకాపా చేస్తున్న ప్రజాపోరాటాలు చూసి చంద్రబాబుకు వెన్నులో వణుకుపుట్టిందన్నారు. అందుకనే ఈ అణచివేత చర్యలకు దిగుతున్నారన్నారు. లిక్కర్ వ్యవహారంలో మొదట రూ.50వేల కోట్లన్నారన్నారు. తరువాత రూ.30వేల కోట్లు, 18వేల కోట్లు, మూడు వేల కోట్లు, రెండువేల కోట్లు అంటూ మాట మారుస్తున్నారన్నారు. దీనిని బట్టి కూటమి ప్రభుత్వం ఏ విధంగా పాలన సాగిస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎక్కడైనా డబ్బును సీజ్ చేశారా అని ప్రశ్నించారు. లిక్కర్ కేసులో ఇప్పటివరకూ ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఒక్కరూపాయి కూడా పట్టుకోలేదన్నారు. వాటికి సంబంధించిన ఆధారాలు కూడా లేవని, కేవలం ఇద్దరు ముగ్గురు ఉద్యోగుల్ని బెదిరించి, భయపెట్టి, కొట్టి వారి మాటలను వాంగ్మూలాలుగా చూపించి కట్టుకథల కుట్ర కేసును నడిపిస్తున్నారని విమర్శించారు. వైకాపా బలంగా ఉండడం చూసి పార్టీలో ప్రభావవంతంగా పనిచేస్తున్న వారిని టార్గెట్ చేసి అరెస్టులు చేస్తున్నారన్నారు. ఇది కచ్చితంగా దర్యాప్తు సంస్థలు, కోర్టులు చేస్తున్న ట్రయల్ కాదని, పూర్తిగా చంద్రబాబు కక్షతో చేస్తున్న రాజకీయ ట్రయల్ అని ఆరోపించారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్న చంద్రబాబునాయుడు, తన మీద ఉన్న కేసులన్నింటినీ, వాటికి సంబంధించిన దర్యాప్తులను నిర్వీర్యం చేసి మరోవైపు వైకాపా మీద వరుసగా కక్షసాధింపు రాజకీయాలతో, కుట్రతో ఇలాంటి కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇప్పుడు జరుగుతున్న లిక్కర్ వ్యవహారాన్నికూడా ప్రజలు చూస్తున్నారన్నారు. వైకాపా చంద్రబాబు చేస్తున్న కుట్రలను ఛేదించుకుంటూ ఈస్థాయికి ఎదిగిందన్నారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బొండాడ వెంకటరమణ, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షులు బేవర మహేష్, బీసీ నాయకులు కంటుముచ్చు సాగర్, మత్స్యకారులు చోడిపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు



# ఈ వారం 'వీరమల్లు'దే రాజ్యమంతా!

ఈయేడాది ప్రథమార్థం చాలా చప్పగా సాగింది. అరకొర విజయాలు తప్ప బాక్సాఫీసు దగ్గర పెద్దగా సందడి కనిపించలేదు. దాంతో నిర్మాతలూ, అభిమానులూ ద్వితీయార్థంపై ఆశలు పెంచుకొన్నారు. దానికి తగ్గట్టు ఈ యేడాది చివరి వరకూ క్రేజీ సినిమాలే రాబోతున్నాయి. అందులో భాగంగా విడుదల కాబోతున్న చిత్రం హరి హర వీరమల్లు.. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీ.ఎం అయిన తరవాత విడుదల అవుతున్న సినిమా ఇది. పవన్ ఎక్కువగా రీమేక్ సినిమాలు చేస్తుంటారు. కానీ చాలా కాలం తరవాత ఆయన నటించిన స్ట్రయిట్ సినిమా. అందులోనూ చారిత్రక నేపథ్యం ఉన్న కథ. నాలుగేళ్ల పాటు సుదీర్ఘంగా చిత్రీకరణ జరుపుకొని, పలు సార్లు వాయిదా పడుతూ.. చివరికి ఈనెల 24న రాబోతోంది. పవన్ కల్యాణ్ సినిమా వస్తోందంటే మరో సినిమాని పోటీకి దింపడానికి భయపడతారు. ఈసారి కూడా పవన్‌కు సోలో ఎంట్రీనే దొరికింది. పెద్ద స్టార్ సినిమా విడుదలై చాలా కాలం అయ్యింది. దాంతో బాక్సాఫీసు దగ్గర ఈ వారం వసూళ్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ముందు రోజు నుంచే ప్రీమియర్లు మొదలైపోతాయి. టికెట్ రేట్లు పెంచుకొనే వెసులుబాటు కూడా దొరికింది. ఏపీలో ప్రీమియర్ షోకి టికెట్ రేటు ఆరు వందలుగా నిర్ణయించారు. ఎలా చూసినా తొలి రోజు భారీ వసూళ్లు కుమ్ముకోవడం ఖాయం. టాక్ బాగుంటే నాలుగురోజుల లాంగ్ వీకెండ్ ని వీరమల్లు క్యాష్ చేసుకొనే అవకాశం ఉంది. దాదాపు రూ.250 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన చిత్రమిది. ఆ పెట్టుబడి



రాబట్టుకోవాలంటే కచ్చితంగా తొలి 4 రోజుల్లోనూ వీరమల్లు మ్యాజిక్ చేయాల్సిందే. ఆ సత్తా కూడా ఈ సినిమాకు ఉంది. సాధారణంగా ఓ ప్రాజెక్ట్ ఆలస్యం అయితే దానిపై క్రేజ్ తగ్గుతుంది. కానీ వీరమల్లు అలా కాదు. పవన్‌పై ఉన్న అభిమానం, ట్రైలర్ లో జరిగిన మ్యాజిక్.. ఈ సినిమాపై ఆశల్ని ఇంకా సజీవంగా ఉంచింది. అదే మ్యాజిక్ తెరపై కూడా కనిపిస్తే కచ్చితంగా వీరమల్లు రాజ్యమేలతాడు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...



# సమంత.. ఎన్నాళ్లకెన్నాళ్లకి?

**ఓ తెలుగు ప్రాజెక్టులో సమంత పేరు విని చాలా కాలం అయ్యింది. ఈమధ్య తను సినిమాల్ని చాలా ఆచి తూచి ఎంచుకొంటోంది. వ్యక్తిగత జీవితానికి తగిన ప్రాధాన్యం ఇస్తోంది. అందుకే సినిమాల్ని బాగా తగ్గించేసింది. కొన్ని ప్రాజెక్టులు ఆమె దగ్గరకు వెళ్లాయి. కానీ వివిధ కారణాల వల్ల ఒప్పుకోలేదు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' లో కూడా ఆమెను తీసుకొందామనుకొన్నారు. కానీ చివరికి రాశీఖన్నాతో సరిపెట్టుకోవాల్సివచ్చింది.**

చాన్నాళ్లకు సమంత తెలుగులో ఓ ప్రాజెక్ట్ ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధమవుతోంది. త్వరలో ఆమె నందినిరెడ్డి దర్శకత్వంలో నటించబోతోందని తెలుస్తోంది. 'అన్నీ మంచి శకునములే' తరవాత నందిని మరో ప్రాజెక్ట్ చేయలేదు. ఆమె కొన్ని కథలు సిద్ధం చేసుకొన్నారు. అందులో ఓ కథ సమంతకు వినిపించినట్టు తెలుస్తోంది. ఆ కథ సమంతకు బాగా నచ్చి, తన బ్యానర్‌లోనే రూపొందించాలని ఫిక్సయ్యారని సమాచారం. ఇటీవల సమంత నిర్మాతగా 'శుభం' అనే సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. బాక్సాఫీసు దగ్గర సరైన ఫలితం రాలేదు కానీ, నిర్మాతగా సమంతకు లాభాల్ని తెచ్చిపెట్టింది. నందిని రెడ్డి ప్రాజెక్ట్ కూడా లిమిటెడ్ బడ్జెట్ తో రూపొందిస్తున్నారని, నటిగా, నిర్మాతగా సమంతకు అన్ని విధాలా సంతృప్తికరమైన సినిమాగా మిగలబోతోందని ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి. సమంత-నందినిరెడ్డి కాంబోలో 2 సినిమాలొచ్చాయి. అందులో 'ఓ బేబీ' మంచి విజయాన్ని సాధించింది. ఇప్పుడు ఇది ముచ్చటగా మూడో ప్రాజెక్ట్ కానుంది.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# 50లో 20 ఎలా పాజిబుల్ మలైకా?

బికినీ బీచ్ విహార యాత్రలతో తన ఇన్ స్టా అభిమానులకు ట్రీట్ ఇవ్వడంలో మలైకా ఎప్పుడూ వెనకాడదు. ఇటీవల కొంత కాలంగా టస్కానీ యాత్ర నుంచి రకరకాల ఫోటోషూట్లను మలైకా షేర్ చేయగా అవన్నీ వైరల్ గా మారాయి. ఇప్పటికీ మలైకా అరోరా టస్కానీ డైరీస్ నుంచి చిల్లింగ్ ఫోటోషూట్లు వెబ్ ని ముంచెత్తుతున్నాయి. మల్లా చిల్ వైబ్స్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. మలైకా అరోరా కొద్దిరోజులుగా తన కుమారుడు అర్హాన్ ఖాన్‌తో కలిసి టస్కానీ బీచ్ లలో సెలవులను గడుపుతోంది. వెకేషన్ లో ఆస్వాధనకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. కుమారుడు అర్హాన్ తో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను షేర్ చేసిన 51 ఏళ్ల మలైకా.. వాటితో పాటు వరుసగా బికినీ, స్విమ్ సూట్లలో ఉన్న ఫోటోషూట్లను కూడా షేర్ చేస్తుంటే అవన్నీ వెబ్ లో సునామీ సృష్టిస్తున్నాయి. 51 వయసులో ఇంతటి అందం, వేడి ఎలా సాధ్యం మ్యాడమ్ ? యాభైలో ఇరవై చూపిస్తున్నారు! అంటూ అభిమానులు ఈ ఫోటో షూట్లపై కామెంట్ చేస్తున్నారు. తాజాగా మలైకా ఓ యూనిక్ ఫోటోషూట్‌ని షేర్ చేసింది. ఈసారి పింక్ బికినీలో దుమారం రేపింది. మలైకా టూపీస్ బికినీ స్పెషల్‌గా ఎలివేట్ అవ్వడంతో ఇది క్షణాల్లో వెబ్ లో వైరల్ గా మారింది. అందమైన బీచ్ రిసార్ట్, చుట్టూ బులుగు సముద్రం, అక్కడ మలైకా రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో షూట్ యూత్‌లో దుమారం రేపుతోంది. టస్కానీ టూర్ ముగించాక తిరిగి మలైకా తన రియాలిటీ షో వ్యవహారలతో బిజీ అవుతుంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..





# ఏనుగే..

## ఆ గ్రామానికి జీవనోపాధి!





కేరళ మానవ సమాజానికీ, ఏనుగులకూ ఏదో అవినాభావ సంబంధముందా అనిపిస్తుంది. అక్కడి గురువాయుర్ ఆలయంతో పాటు.. మరికొన్ని గుళ్లల్లోనూ ఏనుగుల పెంపకం, వాటితో ఆ దైవానికి జరిగే కైంకార్యాలు కనిపిస్తూ, వినిపిస్తుంటాయి. మిగతా సమాజంలో ఏనుగుల బీభత్సాలున్న చోట్లతో పోలిస్తే.. ఏనుగులపై ప్రేమ, వాటి పెంపకం, వాటి పట్ల అక్కడివారు కనబర్చే ఆప్యాయత.. ఇలా ఏనుగుకు ఒక ప్రత్యేక స్థానమే కనిపిస్తుందక్కడ. అలాంటి కేరళలో ఓ గ్రామాన్నే ఏనుగులు గ్రామంగా పిలుస్తుంటారు తెలుసా..? అలా అని అక్కడేం నిజమైన జీవమున్న ఏనుగులేం ఉండవు. కానీ, జీవం ఉట్టిపడే ఏనుగుల తయారీ జరుగుతుంది. ఆ ఏనుగు బొమ్మలు ప్రపంచ ప్రసిద్ధిగాంచి.. ఇప్పుడా గ్రామం ఓ ఇండస్ట్రీగానే రూపుదిద్దుకుంది. ఆ ఊరి పేరు చేరపల్లి.

### ఏనుగుతో బంధం ఆ గ్రామానికి విడదీయరానిది!

స్వాతంత్ర్యానికి ముందే నాటి బ్రిటీష్ ఇండియాలో వారి అవసరాల కోసం నరికివేసే రోజ్‌వుడ్ చెట్ల మొద్దుల నుంచి ఏనుగు శిల్పాల తయారీ ప్రారంభమైంది. తర్వాత్తర్వాతే అదే చేరపల్లి గ్రామం మొత్తం జీవనోపాధైంది.

వారు తయారుచేసే ఏనుగుల శిల్పాలను తీసుకెళ్లి ఏదైనా చిట్టడవి ప్రాంతంలో ఉంచితే.. కొత్తగా అక్కడికెళ్లినవారెవరైనా నిజమైన ఏనుగే అక్కడ ఉందేమోనన్నంత అచ్చెరువొందేలా వాటిని తీర్చిదిద్దడం ఇక్కడి శిల్పకారుల ప్రత్యేకత.



కేరళ రాజధాని తిరువనంతపురానికి సమీపంలో ఉండే చేరపల్లిలో ఏనుగు బొమ్మల తయారీనే వారి జీవన విధానంలో ప్రధాన భాగం. తరతరాలుగా వందలాది కుటుంబాలు అక్కడ ఈట్టి అని పిల్చుకునే రోజ్ వుడ్‌తో ఏనుగుల ప్రతిమలు తయారుచేస్తున్నారు. అదే వారి జీవనోపాధిగా మారింది. కాలక్రమేణా చాలామంది ఇప్పటికే ఇతర వృత్తుల్లోకి మారిపోతున్నప్పటికీ.. ఏనుగు శిల్పాల తయారీ అనే తరతరాలుగా వస్తున్న ఆ సంప్రదాయం ఇంకా అక్కడ కనిపిస్తుంది.

స్వాతంత్ర్యానికి ముందే నాటి బ్రిటీష్ ఇండియాలో వారి అవసరాల కోసం నరికివేసే రోజ్‌వుడ్ చెట్ల మొద్దుల నుంచి ఏనుగు శిల్పాల తయారీ ప్రారంభమైంది. తర్వాత్తర్వాతే అదే చేరపల్లి గ్రామం మొత్తం జీవనోపాధైంది. ఆరు దశాబ్దాలుగా ఇక్కడి శిల్పకారులంతా ఈ ఏనుగు బొమ్మలనే వివిధ రూపాల్లో ఆకట్టుకునేలా తయారుచేస్తూ.. తమ గ్రామం పేరుకు ఓ ప్రత్యేకతను సాధించిపెట్టారు. ఎందుకంటే వారు తయారుచేసే ఏనుగుల శిల్పాలను తీసుకెళ్లి ఏదైనా చిట్టడవి ప్రాంతంలో ఉంచితే.. కొత్తగా అక్కడికెళ్లినవారెవరైనా నిజమైన ఏనుగే అక్కడ ఉందేమోనన్నంత అచ్చెరువొందేలా వాటిని తీర్చిదిద్దడం ఇక్కడి శిల్పకారుల ప్రత్యేకత.

### ఏనుగుల శిల్పాలకు ప్రజాదరణ తద్వార మరింత మంది ఆ వృత్తిలోకి!

డిఫరెంట్ సైజుల్లో చెక్క ఏనుగులు ఇళ్లల్లో షోకేజ్‌లుగా, మ్యూజియాల్లో ఆకట్టుకునేవిధంగా, వీఐపీలకు, సెలబ్రిటీలకు చిరు సత్కారాలందించేలా, అయినవారికి బహుమతులిచ్చేలా వాటిని వివిధ రూపాల్లో మలుస్తుంటారు చేరపల్లి శిల్పులు. అలా చెక్క ఏనుగులకు కేంద్రంగా మారిన చేరపల్లి శిల్పులకు ఈ వ్యాపారమెప్పుడూ కూడా ఆర్థిక నష్టాన్ని మిగల్చలేదు. పైగా ఇప్పటివరకూ తమ గ్రామానికి ఓ ప్రత్యేకతను కల్పించడంతో పాటు ఇక్కడి ఏనుగు శిల్పుల్ని సుసంపన్నుల్ని చేసింది. అందుకే, దేశ, విదేశాల నుంచీ ఇక్కడికి వారి ఏనుగుల చెక్కబొమ్మల కోసం వస్తుంటారు.

కేవలం భారతదేశానికే పరిమితం కాకుండా.. చేరపల్లి అంతర్జాతీయ ఖ్యాతిని పొందడమే విశేషం. ఈమధ్యే అమెరికాకు చెందిన ఓ కొనుగోలుదారు ఏకంగా 250 ఏనుగు శిల్పాలను ఆర్డర్ ఇవ్వగా.. వారు కోరిన సమయంలోపు ఆ ఏనుగుల చెక్క విగ్రహాలను వారికందించింది చేరపల్లి శిల్పుల బృందం. అలా కేరళ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టూరిజం ఔట్ లెట్స్‌లో కూడా చేరపల్లి ఏనుగులను అమ్మకాల కోసం ప్రదర్శనకు ఉంచుతారు. ఈ శిల్పాల ధర మినిమం 300 నుంచి మొదలై.. ఏకంగా ఏడు లక్షల విలువైన శిల్పాల వరకూ ఇక్కడ విక్రయిస్తుంటారంటారు.. ఏనుగుల శిల్పకళనే నమ్ముకున్న 75 ఏళ్ల శశిధరన్ వంటి శిల్పులు.

ఈ శిల్పకళకు మెచ్చిన కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇక్కడి మహిళలను ఈ ఏనుగు శిల్పాల పాలిషింగ్, అలంకరణకు ప్రోత్సహిస్తోంది. రాను రాను నాణ్యమైన కలప లభించకపోవడం ఇప్పుడు ఈ ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అంటారు ఇక్కడి కళాకారులు. అయితే అదే సమయంలో ఇక్కడికొచ్చే వినియోగదారులు మాత్రం రోజ్‌వుడ్ ఏనుగు శిల్పాలంటేనే మక్కువ చూపుతారట.


### ఆసక్తి కనబర్చని నేటితరం!

ప్రస్తుతం వాయినాడ్, ఇడుక్కి వంటి అటవీ ప్రాంతాల నుంచి రోజ్ వుడ్, కలపను ఇక్కడి కళాకారులు సరఫరా చేసుకుంటున్నారు. అయితే, రానురాను మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ఇప్పటి వరకూ కొనసాగిన ఈ ఏనుగు శిల్పాల తయారీకి మొగ్గు చూపేవారి సంఖ్య తగ్గిపోతోంది. ఓవైపు ఆదరణ పెరుగుతున్నకొద్దీ.. ఈ ఇండస్ట్రీలో పని చేయడానికి విముఖత చూపే యువత సంఖ్య అదే స్థాయిలో పెరిగిపోతుండటం ఇప్పుడు ఈ ఏనుగుల గ్రామంలో కనిపిస్తున్న ప్రధానమైన ఆందోళన. అయినప్పటికీ.. ఏనుగు శిల్పాల తయారీ కేంద్రంగా తమ చేరపల్లి నిలిచిపోతుందనే మెండైన ఆత్మవిశ్వాసమూ కూడా ఇక్కడి కళాకారులు, శిల్పుల్లో కనిపిస్తోంది.

- బాతాఖానీ సౌజన్యంతో..









# అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి




(సత్యంన్యూస్, టెక్కలి)

ఉమ్మడిగా కొనుగోలు చేసి, ఉమ్మడి ఖాతాలో ఉన్న ఆస్తిని తనకు సంబంధం లేకుండా వారసత్వంగా సంక్రమించిన ఆస్తిగా మార్చి గురువెల్లి పురుషోత్తం ఆయన అల్లుడు బోకర మోహనరావుకు చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేయాలని బాధితురాలు సత్తారు ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు బాధిత మహిళా రైతు ధర్నా కార్యక్రమం చేపట్టింది. ఆమె తెలిపిన మేరకు చింతలగార రెవెన్యూ గ్రామంలో సత్తారు ధనలక్ష్మి, ఆమె బావ గురువెల్లి పురుషోత్తం జాయింట్‌గా 0.63 సెంట్లు ఆస్తిని కొనుగోలు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో ఉమ్మడి ఆస్తిగా నమోదై ఉంది. ఆర్‌వోఆర్, భూమి హక్కుల చట్టం ప్రకారం జాయింట్‌గా కొనుగోలు చేసిన ఆస్తిని వాటాలు వేసుకొని, ఆ ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకొని, తర్వాత ఎవరి ఆస్తి వారి ఇష్టానుసారం క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. అయితే ఉమ్మడిగా కొనుగోలు చేసిన ఆస్తిని గురువెల్లి పురుషోత్తం, అతని రెండవ అల్లుడు బోకర మోహనరావు రెవెన్యూ రికార్డుల్లో వారసత్వంగా సంక్రమించినట్లు అధికారులతో నమోదు చేయించి, టెక్కలి సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని హైకోర్టు, సుప్రీం కోర్టులు అనేక తీర్పులు వెల్లడించినప్పటికీ టెక్కలి సిఐ మద్దతు, దళిత సంఘం పేరుతో బోకర మోహనరావు, యడ్ల గోపి అట్రాసిటీ కేసు నమోదు చేసి, తమను భూమిపైకి వెళ్లకుండా బైండోవర్ కేసులు పెట్టిస్తున్నారని బాధితురాలు వాపోయింది. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకొని జాయింట్ రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ఉమ్మడి ఆస్తిపై తనకు భూమి హక్కులు కల్పించడంతో పాటు, తనకు, తన కుటుంబ సభ్యులకు హాని కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. 15 రోజుల్లో న్యాయం చేయకపోతే రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో ప్రజాసంఘాలు, సత్తారు వైకుంఠరావు, ఉత్తర జోగికుమార్, పి.బాలకృష్ణ, కె.చంద్రరావు, డి.పోలయ్య, వజ్జాన లక్ష్మణరావు, ఎన్.గౌరమ్మ, వేణుగోపాలరావు, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం, నరసమ్మ, గౌరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

కిష్టప్పపేట గ్రామంలో సోమవారం పశువులకు లంపిస్కిన్ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్ సతీమణి గొండు స్వాతి, సర్పంచ్ అరసవల్లి సత్యవతి, గ్రామపెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగుపురం డాక్టర్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది ఎన్.అర్జున్, ఎ.అజిత్, కె.మోహన్ పశువులకు టీకాలు వేశారు.



# టాయ్‌లెట్స్ బాగుచేయండి



(సత్యంన్యూస్, శ్రీముఖలింగం)

జలుమూరు మండలం శ్రీముఖలింగం ఆలయానికి ఎదురుగా ఉన్న టాయిలెట్స్ ఏడాది కాలంగా చిన్న మరమ్మతుల కారణంగా మూతపడింది. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు, ముఖ్యంగా మహిళలు బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే ఎంపీడీవో స్పందించి మరమ్మతులు జరిపించాలని, భక్తులకు ఉపయోగపడేలా టాయిలెట్స్ బాగు చేయించాలని యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ నేషనల్ అంబాసిడర్ నాయుడుగారి రాజశేఖర్ కోరారు.

# మిథున్ రెడ్డి అరెస్టు అన్యాయం

- వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



రాజకీయ కక్ష సాధింపుతోనే వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని అన్యాయంగా అరెస్టు చేశారని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. సిట్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ గోవిందరావు పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ వైకాపా నాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఎటువంటి ఆధారాలు లేకుండా లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి ప్రమేయం ఉందని తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ తరహా అరెస్టులు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని తెలిపారు. ప్రజలు నమ్మి అధికారం ఇచ్చింది రాష్ట్రానికి మంచి చేయాలని, ప్రతిదాడులు చేయడానికి కాదని హితవు పలికారు.

# స్టాఫ్‌నర్స్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


రాష్ట్రంలో స్టాఫ్‌నర్స్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ కోరారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో ఆ సంఘ జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి ఆధ్వర్యంలో సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షురాలు రాధమ్మ మాట్లాడుతూ స్టాఫ్‌నర్స్‌లతో నాన్ నర్సింగ్ డ్యూటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేయించడం తగదన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు పనికి సరిపడనంతగా లేరని, దీంతో నర్స్‌లపై పని ఒత్తిడి పెరిగిపోతుందని అన్నారు. స్టాఫ్‌నర్స్‌లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ ఎంతగానో కృషి చేస్తుందని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర సెక్రటరీ కోటమ్మ, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు గంగా భవాని, సెక్రటరీ వరలక్ష్మి, మన్యం జిల్లా అధ్యక్షురాలు చంద్రసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

# ఫేక్ ఆధార్లతో ఫిర్యాదులు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో గ్రామ స్థాయిలో జరుగుతున్న ఆక్రమణలు, అక్రమాలపై ఫిర్యాదు చేయడానికి కొందరు ఫేక్ ఆధార్‌లు వాడుతున్నారు. దీంతో సమస్య పరిష్కారం కాకుండానే పని పూర్తి చేశామంటూ ఫేక్ ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరుకు మెసేజ్ అధికారులు పంపుతున్నారు. దీనివల్ల సమయం వృథా తప్ప సాధించినదేమీ కనిపించడంలేదు. ఇందుకు ఒక తాజా ఉదాహరణ చూద్దాం.

మీకోసం గ్రీవెన్స్‌కు సమస్య పరిష్కారం కోసం పదేపదే వస్తున్నవారు పదుల సంఖ్యలో ఉంటారు. దీనికి చెక్ పెట్టడానికి అధికారులు ఆధార్‌ను అనుసంధానం చేసి పీజీఆర్‌సీలో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆన్‌లైన్ చేస్తున్న సమయంలో ఆధార్ నెంబర్‌ను గ్రీవెన్స్‌లో సిబ్బంది ఎంటర్ చేస్తున్నారు. సమస్య ఏమిటీ, ఆధార్ ఎవరిదని ప్రశ్నించడం లేదు. గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు, కాలువలు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత లోపించిందని, మట్టి, ఇసుక తవ్వకాలు తదితర అక్రమాలపై గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులు ఫిర్యాదులు వస్తునే ఉన్నాయి. అయితే ఫిర్యాదుల్లో వాస్తవం ఉందా లేదా అన్నది తేలడానికి ముందు ఫిర్యాదులు చేస్తున్నవారు ఒకరైతే, అందులో అడ్రస్ మాత్రం వేరొకరిది ఉంటోంది. గ్రామాల్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకోవడానికి సంబంధం లేనివారి ఆధార్‌ను ఉపయోగించి గ్రీవెన్స్‌లో నమోదు చేస్తున్నారు.

పొందూరు మండలం కనిమెట్ట పంచాయతీ రాందాసుపురానికి చెందిన అన్నంనాయుడు టీడీపీ సానుభూతిపరుడిగా కొనసాగుతున్నాడు. ఈయన ఆధార్‌తో 2023లో కలెక్టర్‌కు స్పందనలో ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌లో వైకాపా నాయకులు చేసిన నీటిపారుదలకు సంబంధించిన పనులతో పాటు పింఛన్లపైన ఫిర్యాదు చేసినట్టు 'సత్యం'కు వివరించాడు. అన్నంనాయుడుకు ఎటువంటి సంబంధంలేని ఇబ్రహీంబాద్‌లో అవినీతి జరుగుతుందని ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు బాధితుడి ఆధార్‌తో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై సంబంధిత అధికారులు నాయుడికి నోటీసులు పంపించి తీసుకోబోతున్న చర్యలపై వివరించారు. దీంతో ఆయన అధికారులను ఆశ్రయించి తాను ఎటువంటి ఫిర్యాదు చేయలేదని వివరణ ఇవ్వడంతో కథ సుఖాంతం అయింది. అయితే ఈ నెల 3న మరోసారి ఇబ్రహీంబాద్‌లో చేపట్టిన సీసీ రోడ్లు, కాలువల్లో నాణ్యత లేదని, అవినీతి జరిగిందని, దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఇదే అన్నంనాయుడు ఆధార్, పేరుతో కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందింది. దీంతో మరోసారి పంచాయతీరాజ్ శాఖ అధికారులు నోటీసులు పంపించి ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకుంటున్నట్టు వివరణ ఇచ్చారు. దీంతో మళ్లీ అన్నంనాయుడు తన పేరుతో ఎవరో తప్పుడు ఫిర్యాదులు ఇస్తున్నారని అధికారులను ఆశ్రయించాడు. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్ గ్రామంలో టీడీపీ నాయకులు చేసిన పనులకు పొందూరు మండలానికి చెందిన తాను టీడీపీ సానుభూతిపరుడుగా కొనసాగుతూ వారు చేసిన పనులపై ఫిర్యాదు ఎందుకు ఇస్తానని మొత్తుకుంటున్నాడు. ఇబ్రహీంబాద్‌లో కొందరు పనికట్టుకొని తన పేరుతో ఫిర్యాదు చేస్తూ వివాదాల్లోకి లాగుతున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కలిసి విన్నవించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపాడు.

## బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా
# కలగ గోపాల్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పెద్దపాడుకు చెందిన కలగ గోపాలరావును నియమించారు. ఈమేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు ఎల్.వెంగలరావు విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగిన జాతీయ మహాసభల్లో ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలగ గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంఘం తన మీద నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని, జిల్లాలో బీసీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## కొసరు పనులతో.. బోధనకు ఎసరు!

(మొదటిపేజీ తరువాయి)

వాటిల్లో అన్ని పాఠశాలలకు సహకరించే అవకాశం ఉండగా.. వారిని కాంప్లెక్స్‌లకు పరిమితం చేసేశారు. ఇచ్చిన బూట్లు, సాక్సులను పిల్లలు రోజూ వేసుకుని వస్తున్నారా లేదా.. అన్నది గూగుల్ ఫారంలో నింపమనడం, అలా ఎవరైనా కనిపిస్తే టీచర్లను మందలించడం, మెమోలిప్పించడంతో పాటు.. తాము నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానళ్లకు పేరెంట్స్‌తో సబ్‌స్క్రైబ్ చేయించమని అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**బోధనకు అవకాశం ఇవ్వండి**

రోజువారీ లెక్కలు, కొలతలు, సమాచారం ఆన్‌లైన్‌లో అందించడంతోనే సరిపోతోందని టీచర్లు వాపోతున్నారు. బోధనకు సమయం ఇవ్వడంలేదని ఆరోపిస్తున్నారు. రిపోర్టులు, రికార్డులు సరిగాలేకుంటే తమపై ఎక్కడ చర్యలు తీసుకుంటారోనన్న భయం వెంటాడుతోందని, ఫలితంగా బోధన కంటే కొసరు అంశాలపైనే దృష్టి పెట్టాల్సి వస్తోందంటున్నారు. కాంప్లెక్స్ సమావేశాల పేరిట రెండు రోజులు చొప్పున ఆరుసార్లు అంటే ఏడాదిలో 12 రోజులు బడి బోధనకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ప్రత్యేక కార్యక్రమాలు పేరిట మరో రెండు రోజులు వృథా అవుతున్నాయని.. ఈ విధానాన్ని మార్చి బోధనకు అవకాశం ఇవ్వాలని ఉపాధ్యాయవర్గం విజ్ఞప్తి చేస్తోంది.

# దళిత డప్పు కళాకారుల సదస్సు జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆగస్టు 29న నిర్వహించే దళిత డప్పు కళాకారుల సదస్సు జయప్రదం చేయాలని సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. దళిత డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలిలో ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా దళిత డప్పు కళాకారులను కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాసి గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి తోగరణ ప్రకాశ్, జి.శ్రీనివాసరావు, గువ్వాడ అప్పలస్వామి, అరవ ఢిల్లీశ్వరరావు, కుమిలి అప్పారావు, గంగరాపు అప్పారావు, బిడ్డిక భాస్కరరావు, టి.సంజీవరావు, ఒట్టి మన్మధరావు, బలగ సింహాచలం, జర్జన మోహనరావు, బుర్రల్ల రామారావు, పోలాకి అప్పలస్వామి, టి.లక్ష్మీనారాయణయ, గునపు సాంబమూర్తి, టి.రామారావు, అలికాన అప్పారావు, యాగాటి ఆఫీసు, వజ్రగడ శంకరరావు, కళ్యాణ రామారావు, కింజరాపు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు

## - కలెక్టర్‌కు వైకాపా ఇన్‌ఛార్జి చింతాడ రవి ఫిర్యాదు -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



నియోజకవర్గంలో సబ్సిడీపై రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆమదాలవలస వైకాపా ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్‌కు పొందూరు మండలం దల్లిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ కంబాపు నేలవేణి, గ్రామ రైతులతో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. సబ్సిడీపై రైతులకు అందిస్తున్న ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన వారిపై చర్యలు తీసుకొని, సదరు ఎరువులు రికవరీ చేయాలని కోరారు. దల్లిపేట పరిధిలో రైతులకు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ ఎరువులు (యూరియా) అధికార పార్టీ నాయకుల ఫామ్ హౌస్‌లో ఉంచి బ్లాక్ మార్కెట్‌కు తరలించారని, గ్రామ సచివాలయం వద్ద రైతులు ఆందోళన చేసినా అధికారులు స్పందించలేదని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో ఎరువులు అందక ఆందోళన చెందుతున్న రైతులకు సబ్సిడి ఎరువులు పంపిణీ చేయాలని కోరారు. వ్యవసాయానికి సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచి రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఇసుక అక్రమ రవాణా**

ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో నాగావళిలో ఇసుకను తవ్వి అక్రమ రవాణా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని చింతాడ రవికుమార్ కలెక్టర్‌ను కోరారు. ఆమదాలవలస మండలం కొత్తవలస పరిధి పాతూరు వద్ద అక్రమంగా రీచ్ తెరిచి రేయింబళ్లు వందలాది లారీల్లో ఇసుకను అక్రమంగా తరలించుకుపోతూ సహజ వనరులను లూటీ చేస్తున్నారని వివరించారు. కరకట్టకు ఆనుకొని 15 అడుగుల లోతులో ఇసుకను తవ్వి తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమార్కులు, రౌడీమూకలు కలిసి దాడులకు దిగుతున్నారని. ఇసుక తవ్వకాలు వల్ల కరకట్టలు తెగిపోయి సమీపంలో గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని వివరించారు.



మండలంలోని అంబావల్లి గ్రామానికి చెందిన జగదీష్ పండా క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్యఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి అభ్యర్థన పంపారు. ఈమేరకు మంజూరైన రూ.2లక్షల చెక్కును సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, హిరమండలం

# కంటి పరీక్షలు తప్పనిసరి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి జే.చిన్నవాడు మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రతి సంవత్సరం తప్పనిసరిగా కంటిపరీక్షలు చేసుకోవాలన్నారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థులలో మెరుగైన చూపుకు అవసరమైన కంటిఅద్దాలు సూచించినట్లయితే తప్పనిసరిగా ప్రతినిత్యం ధరించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.ఎం.విశ్వనాథ్ గంగాధర్ మాట్లాడుతూ ముందస్తు కంటి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దృష్టిలోపం ఉన్నట్లయితే ముందుగానే గుర్తించి సరిచేయవచ్చన్నారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం ఆర్ కె దాస్ మాట్లాడుతూ ఈనెల 21 నుండి అక్టోబర్ 31 వరకు మండలంలో 6 నుండి 18సంవత్సరాలు ఉన్న ప్రతి విద్యార్థికి కంటిపరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచిత కళ్లద్దాలు సరఫరా, ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి మెరుగైన కంటి పరీక్షల కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి, శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 డి.అర్జునుడు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పి.గంగన్న, ఉపాధ్యాయులు టి.భాస్కరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పి తిరుపతిరావు, ఆరోగ్య విస్తరణాధికారి వివిఎస్ఎస్‌పి.నాగేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షణాధికారి కె.కృష్ణారావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వమా.. పారా హుషార్!

(మొదటిపేజీ తరువాయి)

-ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు ఉచిత సిలెండర్లు ఇస్తామన్న హామీపై 47 శాతం మంది అసంతృప్తి చెందగా 40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై 52 శాతం మంది అసంతప్తి వ్యక్తం చేయగా 18 శాతం మంది సంతృప్తితో ఉన్నట్లు తేలింది.

మొత్తం మీద సూపర్ సిక్స్ హామీల్లో ఒక్క తల్లికి వందనం పథకం తప్ప మిగతా గ్యారెంటీ హామీలపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్లు ఈ సర్వే అంచనా వేసింది.

**వ్యతిరేకత పెంచుతున్న ఇతర అంశాలు**

రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఎమ్మెల్యేలపై వ్యతిరేకత, అసంతృప్తి పెరగడానికి అనేక ఇతర అంశాలు కూడా దోహదం చేస్తున్నాయి. ముఖ్యంగా మద్యం, ఇసుక, మైనింగ్ వ్యవహారాల్లో ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల దందాలు ఎమ్మెల్యేలతోపాటు ప్రభుత్వానికీ చెడ్డపేరు తెస్తున్నాయి. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు సిండికేట్లుగా ఏర్పడి విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం, చీప్ లిక్కర్ అమ్మకాలకు పాల్పడటం విమర్శలపాలవుతోంది. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నా లోకల్ నాయకులు పలు రూపాల్లో వసూళ్లకు పాల్పడుతూ ఆ విధానం ప్రజలకు అందకుండా చేస్తున్నారన్న విమర్శలు అధికంగా ఉన్నాయి. మైనింగ్ వ్యవహారాల్లోనూ స్థానిక ఎమ్మెల్యేలు, అధికార కూటమి నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా డిప్యూటీ ముఖ్యమంత్రిగా అధికారం పంచుకుంటున్న జనసేనాని పవన్‌కల్యాణ్‌పై సొంతపార్టీ క్యాడరే అసంతృప్తితో ఉంది. మరికొన్ని దశాబ్దాలపాటు చంద్రబాబే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉంటారని పలు సందర్భాల్లో పవన్‌కల్యాణ్ చెప్పడం జనసైనికులకు మింగుడు పడటంలేదు. ఎప్పుడూ చంద్రబాబు, తెలుగుదేశమే అధికారంలో ఉంటే.. ఇక జనసేన ఎప్పుడు పూర్తిస్థాయిలో అధికారం చేపడుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికీ తెలుగుదేశం వెనుక ఉంటే దానికి ఊడిగం చేయడమేనా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ భావన క్షేత్రస్థాయిలో పాకిపోతే కూటమి మనుగడ ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఐఐటీయన్ల గ్రూప్ సర్వే హెచ్చరించింది.

# ఐఎంఎల్ డిపోను ఎందుకు విడదీస్తున్నారు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను ఎందుకు విడదీసి కొత్తగా అధికమొత్తంలో ప్రజాధనాన్ని అద్దె రూపంలో చెల్లించి టెక్కలిలో పెడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని వామపక్ష నాయకులు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు, సిపిఐ (యం.ఎల్) జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎస్.బిసిఎల్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయవద్దన్నారు. టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకై ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, మూడు తరాలుగా డిపోలో పనిచేస్తున్న హమాళీల ఉపాధిని కాపాడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో యూనియన్ నాయకులు రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడుని కలిసి వినతిపత్రం ఇచ్చినప్పుడు టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు టెక్కలిలో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. పి-ఫోర్ అంటే ఇదేనా? ప్రజాధనాన్ని లూటీ చేయడం కాదా? ఇప్పుడు టెక్కలిలో కొత్తగా డిపో పెట్టవలసిన అవసరం ఏమొచ్చిందని, ఎవరు పెట్టమని కోరారని మంత్రిని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎస్.బి.సి.ఎల్ లిమిటెడ్ ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో 100మంది దళిత కుటుంబాలకు చెందిన 4ఎకరాల భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో యారక్ బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాల వారికి కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించారన్నారు. అప్పటి ప్రభుత్వ సారా తయారీ నుంచి ఇప్పుడు ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐయంఎల్ డిపోగా నడుస్తున్న దీనిలో 80మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్ పనులు పనిచేస్తూ రోజువారీ వచ్చే ఆదాయంపైనే 350కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపోగా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి ఇప్పుడు కొత్తగా మరో డిపో ఏర్పాటు అవసరం లేదన్నారు. టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో అదనంగా మరో మద్యం డిపో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.మోహనరావు, డి.పార్వతీశం, యం.ఆదినారాయణమూర్తి, వెంకటరావు పాణిగ్రాహి, ఎం.గోవర్ధనరావు, ఎన్.మహేశ్వరరావు, కొత్తకోట. అప్పారావు, ఆర్.ప్రకాష్, నిడిగంట్ల రమణ, గజినీ శ్రీనివాసరావు, లండ సీతారాం, లింగాల రాము, సొంట్యాన శ్రీనివాసరావు, నవిరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంటు హాల్‌లోగల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఆఫీస్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పుట్టిన రోజు వేడుకలలో పాల్గొన్న మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# కూటమి నాయకులను నిలదీయాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

చంద్రబాబు ప్రజలకు నమ్మించి నిలువునా ముంచారని నరసన్నపేట నియోజకవర్గ వైకాపా యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య విమర్శించారు. సోమవారం పోలాకి మండలం వనిత మండలం క్లస్టర్ పరిధిలో తలసముద్రం, జొన్నాం, మబగాం గ్రామాల్లో బాబు షూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం దగా చేసిందన్నారు. రైతులకు, మహిళలకు, 50ఏళ్లు నిండిన వృద్ధులకు, నిరుద్యోగ యువతకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారనే విషయం చెప్పాలని నిలదీశారు. ప్రశ్నించే ప్రతిపక్షం గొంతు నొక్కి అక్రమకేసులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా చంద్రబాబు మేల్కొని ప్రజలకు ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, మండలపార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, వైస్ ఎంపీపీ కలగదండి తాతారావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చింతు రాఘవ, మండల యువజన విభాగం అధ్యక్షులు రెంటికోట త్రినాథరావు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కణితి సత్తిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు, మండల బూత్‌కమిటీ అధ్యక్షులు చింతాడ ఉమమహేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు చింతు రామక్రిష్ణ, సర్పంచ్‌లు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.